# వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 266 | మంగళవారం | 30 ఏప్రిల్ 2024 | పేజీలు : 09 | వెల రూ. 5




## అభివృద్ధికి అండగా ఉంటా

మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి

ఎన్నికల ప్రచారంలో కడియం కావ్య విజ్ఞప్తి

ఐనవోలు మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు

8లో

# కాంగ్రెస్‌లో.. జోష్







**గుజరాత్ పెత్తనానికి, తెలంగాణ పౌరుషానికి మధ్య పోటీ**

**మోడీ, కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన రేవంత్ రెడ్డి**

**రెండు లక్షల మెజార్టీతో కడియం కావ్యను గెలిపించాలంటూ పిలుపు**

**రేగొండ జనజాతర సభ సక్సెస్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపారు. భూపాలపల్లి జిల్లా రేగొండలో మంగళవారం నిర్వహించిన జన జాతర సభలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ, మాజీ సీఎం కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు దేశాన్ని, రాష్ట్రాన్ని నాశనం చేశాయని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో ప్రధాని మోడీ తెలంగాణకు ఇచ్చింది గాడిద గడ్డు అంటూ ఘాటుగా విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య చీకటి ఒప్పందం ఉందని, అది ఖమ్మం సభతో తేటతెల్లమైందని తేల్చి చెప్పారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య గెలుపు ఖాయమైందన్నారు. అయితే భారీ మెజార్టీ సాధించేందకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రామప్ప ఆలయంలోని శివుడిపై ఒట్టేసి చెబుతున్నా ఆగస్ట్ 15 లోపు రైతులందరికీ రూ.2 లక్షల రుణ మాఫీ చేసి తీరుతామంటూ స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు గుజరాత్ పెత్తనానికి, తెలంగాణ పౌరుషానికి మధ్య జరుగుతున్న పోటీగా అభివర్ణించారు. మోడీ, అమిత్ షాలను ఈ ఫైనల్‌లో ఓడించాలని పిలుపునిచ్చారు. - వరంగల్ వాయిస్, రేగొండ

వివరాలు 2లో..




8లో

## పారదర్శకంగా ఎన్నికలు

సీ-విజిల్ ఆప్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలి

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

సీపీ అంబర్ కిషోర్ ఝూతో కలిసి విలేఖరుల సమావేశం

## నిప్పులు కక్కుతున్న భానుడు

ఎండలకు తోడు ఉక్కపోత

ములుగు, భూపాలపల్లిలో రెడ్ అలర్ట్




9లో..

# కాంగ్రెస్‌లో జోష్



**గుజరాత్ పెత్తనానికి, తెలంగాణ పౌరుషానికి మధ్య పోటీ**

**మోడీ, కేసీఆర్ పై నిప్పులు చెరిగిన రేవంత్ రెడ్డి**

**రెండు లక్షల మెజార్టీతో కడియం కావ్యను గెలిపించాలంటూ పిలుపు**

**రేగొండ జనజాతర సభ సక్సెస్**

**వరంగల్ వాయిస్, రేగొండ :** గుజరాత్ పెత్తనానికి, తెలంగాణ పౌరుషానికి మధ్య జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చాటాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటికే జరిగిన సెమీ ఫైనల్స్ లో కేసీఆర్ ను చిత్తుగా ఓడించాం. ఇప్పుడు ఫైనల్ జరుగుతోంది. ఫైనల్ లో కూడా మనం విజయం సాధించాలంటే మోడీ, అమిత్ షాను చిత్తుగా ఓడించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా రేగొండలో మంగళవారం నిర్వహించిన జన జాతర సభలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ, మాజీ సీఎం కేసీఆర్ పై నిప్పులు చెరిగారు. వరంగల్ లోక్ సభ అభ్యర్థి కడియం కావ్య గెలుపు ఖాయమైందన్నారు. అయితే రెండు లక్షల మెజార్టీ సాధించేందకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రశ్నిస్తే వేధింపులు..

తెలంగాణ సమాజం ఎవరికి తలవంచదు.. నేనవరికి భయపడనంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఢిల్లీ సుల్తానులు వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ నుంచి గాంధీభవన్ కు పోలీసులను పంపించారంటూ ఆరోపించారు. ఢిల్లీ పోలీసులకు.. గుజరాత్ నేతలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. చూసుకుందాం బిడ్డా అని హెచ్చరించారు. వరంగల్ కు విమానాశ్రయం రాకుండా ప్రధాని మోడీ అడ్డుకున్నారంటూ మండిపడ్డారు. చిన్న చినుకు పడితే వరంగల్ నగరం జలమయం అవుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వరంగల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. మోడీ, అమిత్ షాను ఈ ఫైన ల్ లో ఓడించాలి. బీజేపీ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని దుయ్యబట్టారు. డీబీఎం 38 నుంచి నీళ్లు ఇప్పిస్తానని, వరంగల్ కు అధిక నిధులు ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## రిజర్వేషన్లపై కుట్ర..

రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర చేస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేసేందుకు మోడీ, అమిత్ షాలు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పిస్తే, బీజేపీ వాటిని ఎత్తేయాలనే కుట్ర చేస్తోందన్నారు. కేసీఆర్ విధానాలను బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తోందని రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. గత పదేళ్లలో పాలమూరు, కరీంనగర్ జిల్లాలు కేసీఆర్ చేతుల్లో బంది అయ్యాయని చెప్పారు. ఈ జిల్లాలకు కేసీఆర్ ఏం చేయలేదన్నారు.

## సైనికుల్లా పనిచేయాలి..

రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల వలే పోరాడాలని, ఇండియా కూటమిని గెలిపించానలి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ను గెలిపించేందుకు బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించరు. అందుకే అమాయకుడిని అభ్యర్థిగా నిలిపారని ఎద్దేవా చేశారు. అదే బలమైన నాయకుడిని అభ్యర్థిగా నిలిపితే త్రిముఖ పోటీ జరిగి కాంగ్రెస్ కు మేలు జరుగుతుందన్న కుట్రతోనే బీజేపీ, బీఆర్ ఎస్ ముందుకు సాగుతున్నారని ఆరోపించారు.

## కారు మళ్లీ రాదు..

కారు మళ్లీ రాదని, అది రోడ్డేక్కె ప్రసక్తే లేదని సీఎం రేవండ్ రెడ్డి ఎద్దేవా చేశారు. అందుకు కేసీఆర్ బస్సులో తిరుగుతున్నారన్నారు. ఆయన బస్సు యాత్రతో ప్రజలకు ఒనగూరేదేమీ లేదని మండి పడ్డారు. కడియం కావ్యను రెండు లక్షల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు, ప్రజలతో రేగొండ జన జాతర సభ విజయవంతమైంది. భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ జన జాతర సభలో వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, డాక్టర్ సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, పార్లమెంట్ ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ లోక్ సభ అభ్యర్థి కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

















## బీజేపీ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** 62వ డివిజన్ పరిధిలోని 166 బూత్ లో మంగళవారం బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ వరంగల్ లోక్ సభ అభ్యర్థి అరూరి రమేష్ కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరామన్నారు. ఇంటింటికి కరపత్రాలు, స్టిక్కర్స్ అతికించడం జరిగిందన్నారు. కమలం పువ్వు గుర్తుకే మన ఓటు, మరోసారి ప్రధానమంత్రిగా మోడీని గెలిపించాలన్నారు. ఈ ప్రచారంలో సుంచు విజయ్, చిరంజీవి, రవి, అనిల్, మంద మౌనిక, విజేత తదితరులు పాల్గొన్నారు.

## ఆటో, బైక్ దొంగల అరెస్ట్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరుసగా ఆటో, బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే వరంగల్ లోని కొత్తవాడ తుమ్మలకుంటకు చెందిన మహమ్మద్ సాదిక్, కొంక కిరణ్, గున్న ఏ రాకేష్ అనే ముగ్గురు వ్యక్తులు మద్యానికి, జల్సా లకు అలవాటు పడి దానికి కావలసిన డబ్బుల కోసం వరంగల్ పరిసర ప్రాంతాల్లో బయట పార్కింగ్ చేసి ఉన్న ఆటో, బైకులను టార్గెట్ చేసుకొని వరుసగా దొంగతనాలు చేసేవారు. మంగళవారం వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానస్పదంగా కనిపించిన మహమ్మద్ సాదిక్, కొంక కిరణ్ అను అదుపులోకి తీసుకోగా, రాకేష్ అలియాస్ గున్న అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఇద్దరు పట్టుబడ్డ వ్యక్తులను మట్టేవాడ పోలీసులు రిమాండ్ కు తరలించారు. వారి నుంచి మూడు ఆటోలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మట్టెవాడ సీఐ టి. గోపి, ఎస్సై కె.కుమార్, టి.లచ్చయ్య, ఏఎస్సై చంద్రమౌళి, క్రైమ్ టీం కానిస్టేబుల్స్ హరికాంత్, అలీ, తిరుపతిలను వరంగల్ డివిజన్ ఏసీపీ నందిరాం నాయక్ అభినందించారు

## రిటైర్డ్ ఆర్ఎస్ఐకు సన్మానం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నాలుగు దశాబ్దాల కాలం పాటు పోలీసు శాఖలో విధులు నిర్వహించిన, శాంతి భద్రతలు పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించి పదవి విరమణ పోందుతున్న పోలీస్ అధికారులు సేవలు నేటి తరం పోలీసులు మరువద్దని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలియజేశారు. పోలీస్ విభాగంలో సుధీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన ఆర్ఎస్ఐ టి.బుచ్చి రాములును మహబూబాబాద్ జిల్లా ఎస్పీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారి ప్రస్తుత స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్లిష్ట సమయాల్లో తమ కుటుంబాలకు దూరంగా వుంటూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన అలనాటి పోలీస్ అధికారులు నేటి తరం పోలీస్ అధికారులకు అదర్శంగా నిలుస్తారని అన్నారు. పదవీ విరమణ పోందిన తరువాత కుడా సమాజం నుంచి గౌరవాన్ని పోందేవారు కేవలం పోలీస్ అధికారులు మాత్రమేనని పేర్కొన్నారు. పదవీవిరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక లబ్దిని ప్రణాళికబద్దంగా పొదుపు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ఏఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, ఆర్ఐలు అనిల్ కుమార్, భాస్కర్, సోములు, సాంబశివరావు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లమ్మ చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



### బాధ్యులైన రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలి

### డీబీఎఫ్, ఏబీఎస్ నాయకులు చుంచు రాజేందర్, కలకోటి మహేందర్

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హసన్ పర్తి మండలంలోని పెగడపల్లి రెవెన్యూ శివారులో ఉన్న ఎల్లమ్మ చెరువు శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్)రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కబ్జాకు గురవుతున్న చెరువు శిఖం భూములను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతుందని పెగడపల్లి, వంగపహాడ్ గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్నప్పటికీ, దీనిపై పత్రికలలో వార్తలు వస్తున్నప్పటికీ స్థానిక తహసీల్దార్, రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. అధికారుల అండదండలతోనే దర్జాగా కబ్జాలు చేస్తున్నారని దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని సంబంధిత భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చారని ప్రజలు ఆరోపిస్తున్నారని దీనిపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేపాక మల్లేశం, కార్యదర్శి కొలిపాక రమేష్, మోరే రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అరూరిని భారీ మెజారిటీతో గెలిపించండి



**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ లోక్‌సభ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ కమలం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం నడికూడ మండలంలోని రాయపర్తి గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయచందర్ రెడ్డి, పరకాల కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావుల ఆదేశానుసారం భారతీయ జనతా పార్టీ గ్రామ అధ్యక్షుడు మూల తిరుపతిరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతి నరేంద్ర మోడీతోనే సాధ్యపడుతుందని తెలిపారు. రైతుల కోసం ఎరువుల సబ్సిడీ, పీఎం కిసాన్ , దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత నరేంద్ర మోడీదే అని అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోడీని గెలిపించేందుకు వరంగల్ లో అరూరి రమేష్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పర్నెం మల్లారెడ్డి, 23వ బూత్ అధ్యక్షుడు అల్లం వజ్రం, మోత్కూరు శంకరయ్య, పరమేశ్వర్, రాము పాల్గొన్నారు.

## ఎన్నికల ఖర్చును తప్పక నమోదు చేయాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చును తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రచిత్ రాజ్, వ్యయ పరిశీలకులు ఉమాకాంత ధృపాటీ, రాం కుమార్ గోపాల్, పోలీస్ అబ్జర్వర్ చరణ్ జిత్ సింగ్ సమక్షంలో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి ప్రతినిధులకు ఎన్నికల వ్యయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని, ఎఫ్.ఎస్.టీ, ఎస్.ఎస్.టీ, కేంద్ర బలగాలతో చెక్ పోస్టుల వద్ద నిరంతరం 24/7 పటిష్ట బందోబస్తు నిర్వహిస్తుంటారని, సర్టిఫికేషన్ అనుమతులను నిర్ధారిత సమయంలో పొందాలని, తప్పకుండా ఎన్నికలకు సంబంధించిన ప్రతీ ఖర్చును రిజిస్టర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు సహాయ రిటర్నింగ్ అధికారులు లెనిన్ వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, మహబూబాబాద్ ఆర్డీఓ ఎల్.అలివేలు, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్ కుమార్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యం

### పొరిక బలరాంను గెలిపించాలి

### రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ములుగుకు వచ్చిన మంత్రి సీతక్క సమక్షంలో ములుగు మండలం బరిగలోనిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కాయిత మొగిలి, కాయిత రాజురానబోయిన నారాయణ స్వామి, మాజీ ఉప సర్పంచులు, కాయిత రాజయ్య, వైనాల రమేష్, పులి భద్రయ్య, చిలుక సురేష్ లతో పాటు 50 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా, వారికి రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలో కి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు పేదల కోసం పొట్లాడే రాహుల్ గాంధీ, బడా వ్యాపారులకు ప్రజా ధనాన్ని దోచిపెట్టే నరేంద్ర మోడీ కి మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు. లక్షల కోట్ల రూపాయలు పేదల దగ్గర పన్నుల పేరుతో వసూలు చేసి కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేసిన మోడీకి లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. రాహుల్ గాంధీ కావాలనుకుంటే యూపీఏ పదేళ్ల కాలంలోనే ప్రధానమంత్రి అయ్యేవారని, కానీ, ఏనాడూ ఆయన పదవిని ప్రేమించలేదని అన్నారు. ప్రజలను ప్రేమించడం, ప్రజలందరిని కలిపి ఉంచడమే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, యువకులు, విద్యార్థులు త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పొరిక బలరాం నాయక్ కు ఓటు వేసి రాహుల్ గాంధీకి తోడుగా లోక్ సభకు పంపాలని సీతక్క పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
మంగళవారం 30, ఏప్రిల్ 2024
www.warangalvoice.net

# ప్రశాంత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికలు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మే13న జరిగే లోక సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్ల ను పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ లోక్ సభ స్థానంలో 30 మంది అభ్యర్థులు 56 సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా, ఐదుగురు అభ్యర్థులు పరిశీలనలో తిరస్కరణకు గురయ్యారని, ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోగా బరిలో 23 మంది అభ్యర్థులు నిలిచారని తెలిపారు. ఎన్నికలను ప్రభావితం చేసే నగదు, మద్యం, బంగారు కానుకలను పంపిణీ చేసి ఓటరును ప్రభావితం చేయకుండా అధికార యంత్రాంగం పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారని, మహబూబాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో 15లక్షల 32 వేల 366 మంది ఓటర్లు ఉన్నారని వీరిలో 7లక్షల 47 వేల 836 మంది పురుష ఓటర్లు, 7లక్షల 84వేల 424 మహిళా ఓటర్లు కలరని, 1809 పోలింగ్ స్టేషన్లలో 335 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లు ఉన్నాయన్నారు. ఎన్నికలకు సంబందించిన అంశాల కోసం ఫిర్యాదులను అధికారులకు, సీ విజిల్ ద్వారా చేయవచ్చున్నారు. లోక్ సభ ఎన్నికల బరిలో పోటీ పడే అభ్యర్థులు 95 లక్షల రూపాయల లోపే ఖర్చు చేయాలని ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం 25 రోజులలో ఎన్నికల ఖర్చు చేసిన వివరాలు తెలపాలని లేని పక్షంలో వారిపై అనర్హత వేడుపడుతుందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రలోభాలకు లోనుకాకుండా ఓటర్లు తమ ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో ఎన్నికల పరిశీలకులు రచిత్ రాజ్, వ్యయ పరిశీలకులు రాం కుమార్ గోపాల్, ఉమాకాంత్, శాంతి భద్రతల పరిశీలకులు చరణ్ జిత్ సింగ్, అదనపు కలెక్టర్లు డేవిడ్, లెనిన్ వత్సల్ టొప్పో పాల్గొన్నారు.

## పోలీస్ ఔదార్యం



**వరంగల్ వాయిస్, మడికొండ :** కాజీపేట పట్టణం, మడికొండ మేయిన్ రోడ్డు జంక్షన్ దగ్గర గల వెంకటేశ్వర ఫోటో స్టూడియో వద్ద మతిస్థిమితం లేని ఒక అనాథ వృద్ధురాలు అక్కడ ఉండగా, ఆ మహిళకు అక్కడే విధి నిర్వహణలో ఉన్న మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ వృద్ధురాలిని చూసి చలించి పోయి భోజనం, పండ్లు, నీరు అందించి ఆకలి తీర్చారు. వృద్ధురాలిని వివరాలు అడగగా తన పేరు యాదమ్మ, సంగారెడ్డి అని తెలిపిందన్నారు.

## బాధితుడికి ఎంపీడీఓ పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** నడికూడ ఐకేపి సీసీ కుమార స్వామి గ్యాస్ట్రిక్ సమస్య వలన పరకాల ప్రభుత్వ హాస్పిటల్ లో అడ్మిట్ అయినట్టు తెలిసిన వెంటనే పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు వెంటనే వెళ్లి వారిని పరామర్శించి ఆర్ యంఓతో మాట్లాడి సరైన చికిత్స చేయాలని సూచించారు. అతడికి ఎలాంటి ఇబ్బంది లేదని, గతంలో హార్ట్ స్టంట్ ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సలహా ఇచ్చారని తెలిపారు. ఎలాంటి అవసరమైన సంప్రదించ వలసినదిగా కుటుంబ సభ్యులకు చెప్పారు. ఆయన వెంట పరకాల ఏపీఎం క్రాంతి, ఏపీఓ ఇందిర, నడికూడ సిబ్బంది ఉన్నారు.

## కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలో గట్లకానిపర్తి, కొత్త గట్టు సింగారం, మాందారి పేట, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వరంగల్ జిల్లా జడ్పీ చైర్పర్సన్, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్ళి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మే 13న జరగబోయే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డా.సుధీర్ కుమార్ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

## ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా ఎలక్షన్ అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల, హనుమకొండలో స్వీప్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జీఎంహెచ్ డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్ లు వారి సహాయకులు హాజరయ్యారు. ముఖ్య అతిధిగా హాజరైన సూపరింటెండెంట్ ఇంచార్జి డాక్టర్ సరళా దేవి మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ మే 13న జరిగే లోక్ సభ ఎన్నికలలో విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తుందన్నారు. డాక్టర్లు తమ విధులతో పాటు ఓటు వేయడం కూడా బాధ్యతగా భావించాలన్నారు. అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. మదన్మోహన్ రావు మాట్లాడుతూ ఎన్నికలలో ఎటు వంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మనం ఓటు వేయడం కాకుండా చుట్టూ ప్రక్కల ఉన్న వారు కూడా ఓటు వేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.మదన్మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్ పాషా, ఆర్ఎంఓ డాక్టర్ సారంగం, ప్రోగ్రాం అధికారులు ఎన్‌సీడీడ అధికారి డాక్టర్ ఉమా శ్రీ, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమ బిందు, డాక్టర్ లక్ష్మి నారాయణ, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, డీపీహెచ్ఎన్ఓ సుశీల, హెచ్ఈఈఓ చంద్ర శేఖర్, టి. మాధవ రెడ్డి, రామేశ్వరి, సూపర్ వైసర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కడియం కావ్య గెలుపునకు కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యుడు కడియం శ్రీహరి, నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిరా ఆదేశాల మేరకు మంగళవారం చిల్పూర్ మండల కేంద్రంలో కార్యకర్తలు సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మండల పార్టీ అధ్యక్షుడు గడ్డమీది సురేష్ మాట్లాడుతూ మే 13న జరుగనున్న పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం బలపరిచిన ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెల్పించే విధంగా అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. గ్రామశాఖ అధ్యక్షుల అధ్యక్షతననే అన్ని కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గ్రామాలలో నాయకుల మధ్య సమన్వయం చేసి అందరినీ కలుపుకొనీ పోయే బాధ్యత గ్రామశాఖ అధ్యక్షులదే అన్నారు. ఏ గ్రామంలో అయినా సమస్యలు ఉంటే మండల సమన్వయ కమిటి దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతీ గ్రామంలో కార్యకర్తలు అందరూ కష్టపడి పనిచేసి చిల్పూర్ మండలం నుంచి భారీ మెజారిటీ ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండల, జిల్లా ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యజి లోపాయికారి ఒప్పందం

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మండలంలోని గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో మొగిలిచర్ల, గోపాల్ రెడ్డి నగర్, పోగుల ఆగయ్య నగర్, రెడ్డిపాలెం 133, 134,135,136,140 పోలింగ్ బూతులలో వరంగల్ పార్లమెంటు అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రచారం ఉధృతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయి కారిగా ఒప్పందం చేసుకుని బీజేపీ ఎంపీ అభ్యర్థులకు ఎక్కువ మెజార్టీ రాకుండా అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వరంగల్ పార్లమెంటు అభ్యర్థి అరూరి రమేష్ గెలుపును ఎవరూ ఆపలేరని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలను నమ్మి ఓటు వేస్తే ఆ ఓటు వృధా అవుతుందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలు ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కామగోని రఘుపతి, డివిజన్ నాయకులు రాధారపు మల్లికార్జున్, కునమల్ల రవి, లంకలపెల్లి స్వామి, గబ్బెట శ్రీనివాస్, అప్పని సాగర్, రాసమల్ల వీరస్వామి, సంపత్, రాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు సాధన ఉద్యమానికి సహకరించండి



**వరంగల్ వాయిస్, ములుగు :** రెండవ విడత దళిత బంధు పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన లబ్ధిదారులందరికీ దళిత బంధు అందేలా నూతన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొగిల మహేష్, రాష్ట్ర కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్య అన్నారు. వరంగల్ పర్యటనలో భాగంగా వరంగల్ కి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మహేష్ , సమ్మయ్య కెప్టెన్ లక్ష్మీ కాంతారావు నివాసంలో కలిసి పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. దళిత బంధు సాధన కోసం గత నాలుగు నెలలుగా నిర్విరామంగా చేస్తున్న పోరాటాలను, కార్యక్రమాలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి వివరించారు. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చిన ఘనత మీదేనని తెలుపుతూ.. అలాగే ఈ రెండో విడత దళిత బంధు పథకం ద్వారా ఎన్నికైన లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కేసీఆర్ ని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేసీఆర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల తర్వాత దళిత బంధు సాధన కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. కచ్చితంగా దళిత బంధు సాధించే విధంగా ముందుకు సాగాలని రాష్ట్ర కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ మడికొండ రమేష్, రాష్ట్ర సలహాదారు దర్శనాల సంజీవ పాల్గొన్నారు.

## మానవ జీవితం చాలా విలువైనది

### ఎస్సై కూచిపూడి జగదీష్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో మంగళవారం పదో తరగతి పరీక్షల రిజల్ట్స్ రావడం జరిగింది. పాసైన విద్యార్థిని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. అలాగే ఫెయిల్ అయిన విద్యార్థులు, మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులు ఎలాంటి ఆత్మహత్య ప్రయత్నం చేయకుండా ఉండాలని, జీవితం చాలా విలువైనదని, ఇంకా జీవితంలో చాలా అవకాశాలు వస్తాయని, ఎవరు కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. మీకు ఏదైనా ఇబ్బంది ఉంటే తొర్రూరు ఎస్సై ని కలవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు కూడా మీ పిల్లల్ని తిట్టడం, కొట్టడం లాంటివి చేయద్దని పేర్కొన్నారు.

## డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంప్



**వరంగల్ వాయిస్, దేశాయిపేట :** వరంగల్ సీకేఎం కాలేజ్ వద్ద డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంప్ ను నిర్వహించారు. సంరక్ష హాస్పిటల్ ఉచిత వైద్య సేవలు , ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, హాస్పిటల్ వైద్య సేవలు బాగున్నాయని స్థానిక కార్పొరేటర్ కావేటి కవిత రాజు తెలిపారు. వరంగల్ ప్రజలు సంరక్ష హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ,ఆరోగ్య వంతమైన సమాజం కోసం , షుగర్ వ్యాధి పట్ల జాగ్రత్త వహించి ఉండాలన్నారు. షుగర్ వ్యాధితో శరీరంలోని అన్ని అవయవాలు మెల్లగా దెబ్బతింటాయని, షుగర్ వ్యాధి నియంత్రణలో ఉండేటట్టు చూసుకోవాలని, మారుతున్న ఆహారపు అలవాట్ల వలన, సరైన వ్యాయమం లేకపోవటంతో షుగర్ వ్యాధిన పడే వారి సంఖ్య పెరుగుతుందని, కాబట్టి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకొని, షుగర్ టెస్ట్ రెగ్యులర్ గా చేయంచు కోవాలని కార్పొరేటర్ కావేటి కవిత , డాక్టర్ అజిత్ మహమ్మద్ కోరారు. ఈ క్యాంప్ లో 87 మందికి ( స్త్రీ ,పురుషులకు ) ఉచితంగా రక్త పరీక్షలు, వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సంరక్ష హాస్పిటల్ సిబ్బంది , రవి కిరణ్ , సురేష్, సృజన్, సారిక , రమా దేవి, సుమలత, రజిత, రమేశ్, తదితరులు పాల్గొని వైద్య శిబిరం లో సేవలందించారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బండి వెంకటేష్, గందే అనిత కాంగ్రెస్ పార్టీ వీడి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి మాజీ ఎమ్మెల్యే పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన అనంతరం వారు మాట్లాడుతూ కొందరి మాయ మాటలు నమ్మి కాంగ్రెస్ లో చేరి తప్పు చేశామని తెలిపారు.

### బీఆర్ఎస్ లోకి బీఎస్పీ మండలాధ్యక్షుడు..

పరకాల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన బీఎస్పీ మండల పార్టీ అధ్యక్షుడు పెండేల మహేందర్ ఆ పార్టీకి రాజీనామా చేస్తూ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మహేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ కూలర్ ప్రారంభం




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్ ను (40 లీటర్ల) మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రారంభించారు. ఎండాకాలం పోలీస్ సిబ్బంది చల్లని నీరు తాగాలనే ఉద్దేశ్యంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారి సహాయ సహకారాలతో ఆర్ఐ (వెల్ఫేర్ ) సాంబ శివరావు చొరవతో తాగునీటి వొల్టాస్ వాటర్ కూలర్ ను జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బంది కోసం ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.బి.నెహ్రూ నాయక్, డా.ఎస్. సురేష్ సెక్రటరీ, డా.చంద్రశేఖర్, డా.రూప్ లాల్, డా.ప్రమోద్ రెడ్డి, డా.వైదేహి (ట్రెజరర్) చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చన్నయ్య, ఏ.ఆర్ డీఎస్పీ విజయ ప్రతాప్, ఆర్ఐలు సాంబ శివరావు, ఆర్ఐ సోమల్లు, ఆర్ఐ అనిల్, ఆర్ఐ భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

## 10 జీపీఏ సాధించిన కీర్త్



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాలకు చెందిన పోచంపల్లి కీర్త్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపి 10జీపీఏ సాధించాడు. కరీంనగర్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ ప్రతిభ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన కీర్త్ అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాగా 10జీపీఏ సాధించిన కీర్త్ ను తల్లిదండ్రులు రాజ్ కుమార్ ప్రియాంక, ఉపాధ్యాయులు అభినందించారు.

# కాంగ్రెస్‌ను ఇక తరమాల్సిందే..

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ప్రజల గోసకు కారణమైన ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు తెలపాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం నియోజకవర్గంలోని పరకాల మండలం కామారెడ్డిపల్లి, అలియాబాద్, పోచారం, వెల్లంపల్లి, మల్లక్కపేట, వెంకటాపూర్, హైబోతుపల్లి, లక్ష్మీపురం, పైడిపల్లి, నాగారం గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. ప్రజలు ఉపాధి కోసం మళ్లీ విదేశాల బాట పట్టాల్సి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశనైకే ఆదర్శంగా నిలిపిన ఘనత కేసీఆర్ దన్నారు. కానీ, కాంగ్రెస్ సర్కార్‌లో పచ్చని పంటలతో కళకళలాడే భూములు బీడుగా మారాయని విమర్శించారు. పదేండ్లు అద్భుతంగా నిర్మించిన తెలంగాణను మూడు నెలల్లోనే కుప్పకూల్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ను తరిమేయాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపాలని ప్రజలను కోరారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ పార్టీకి లోక్ సభ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు రెండు ఒకటేనని ఆ పార్టీలకు ఓటువేసి ప్రజలు మల్లి మోసపోవద్దని సూచించారు. వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని కేసీఆర్ కు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సిలివేరు మొగిలి, మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నాయకులు నేతాని శ్రీనివాస్ రెడ్డి, మేడిపెల్లి శోభన్, కోరే రమేష్, గురిజపల్లి ప్రకాష్ రావు, ఆముదాలపల్లి అశోక్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సిబ్బందికి అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, మరిపెడ :** టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ సబ్ డివిజన్ పరిధిలోని ఆపరేషన్, మెంటెనెన్సు విద్యుత్ సిబ్బందికి జూనియర్ లైన్ మెన్ నుంచి ఫోర్ మెన్ క్యాడర్ వరకు, సిబ్బంది అంతర్గత, సమర్థత, అభివృద్ధి కోసం శిక్షణ, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్ సరఫరాకు, విద్యుత్ సంస్థ అభివృద్ధి కోసం విద్యుత్ సిబ్బందికి అవగాహనతో పాటు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎస్ఈ నరేష్ మాట్లాడుతూ వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని , విద్యుత్ సిబ్బంది విధులు, బాధ్యతలను తెలియజేశారు. అలాగే భారీ వర్షాలు, గాలి దుమారాలు వీచే సమయంలో, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని, స్పాట్ ఎర్థింగ్ చేసుకొని లైన్ పనులు చేయాలని, అలాగే వినియోగదారులు కూడా విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తల గురించి అవగాహనా కల్పించాలన్నారు. అన్ని పరికరాలకు, ఇనుప వస్తువులకు ఎర్థింగ్ చేసుకొని కరెంట్ షాక్ రాకుండా నిరోధించవచ్చని తెలిపారు. విద్యుత్ చాలా ప్రమాదకరం, కంటికి కనపడదు, కాబట్టి అన్ని జాగ్రత్త లు తీసుకోవాలని తెలిపారు. 33కే వి, 11కే వి లైన్ ల నిర్వహణ తరుచుగా చేస్తూ కరెంట్ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలనీ, పెండింగ్ బిల్లులు వసూలు చేయాలన్నారు. విద్యుత్ సిబ్బందికి అవగాహన సదస్సు ,శిక్షణ తరగతులు మరిపెడలోని ట్రైబల్ వెలిఫేర్ డిగ్రీ కాలేజ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్నీకల్ డీఈ సునీత, తొర్రూరు డీఈ మధుసూదన్, ఏడీఈ లోక్ నాథ్ రెడ్డి, సబ్ డివిజన్ ఏఈలు, సబ్ ఇంజినీర్లు, ఫోర్ మెన్ లు, సీనియర్ లైన్ ఇన్ స్పెక్టర్‌లు, ఎల్ఐలు, లైన్ మెన్ లు, జేఎల్ఎంలు పాల్గొన్నారు.

## విజేతలకు నగదు పారితోషికాలు



**వరంగల్ వాయిస్, కేయూ :** రాజమహేంద్రవరం, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో డిసెంబర్ నెల లో నిర్వహించిన సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ (మహిళల) గోల్డ్ మెడల్ విజేత, ఖమ్మం కవితా మెమోరియల్ డిగ్రీ కాలేజీ కి చెందిన ఎం.అనూషకు వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ రూ. 6000 నగదు పారితోషికం అందజేశారు. అదే విధంగా బటిండా, గురు కాశీ యూనివర్సిటీ లో డిసెంబర్ నెల లో నిర్వహించిన సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ అర్చరీ (పురుషుల) విజేతలు ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలకు చెందిన ఎం. లక్ష్మణ్ కు రూ. 4000 నగదు పారితోషికం అందజేశారు. ఖమ్మం కవితా డిగ్రీ కాలేజీ కి చెందిన బి.అనిల్, సీహెచ్.వంశీకి, ఖమ్మం, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలకు చెందిన కే. లక్ష్మణ్, ఈ.సంపత్ కు రూ. 3000 చొప్పున ఒక్కొక్కరికి నగదు పారితోషికం అందించారు. అదే విధంగా పంజాబ్ రాష్ట్రం, అమృతసర్ లోని గురు నానక్ దేవ్ యూనివర్సిటీ లో ఫిబ్రవరి లో నిర్వహించిన సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ జూడో (పురుషుల) పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన హనుమకొండ మాస్టర్ జీ డిగ్రీ కాలేజీ కి చెందిన రోహన్ సింగ్ కు రూ.3000 నగదు పారితోషికం అందజేశారు. మరిన్ని విజయాలు సాధించి విశ్వవిద్యాలయానికి పేరు ప్రతిష్టలు తేవాలని వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి ఆచార్య వై.వెంకయ్య, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.టి.బి.టి ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## కవులు, రచయితలపై మతోన్మాదుల దాడి దుర్మార్గం

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** లౌకిక విలువలు- సాహిత్యం అను అంశంపై వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన రచయితల సదస్సుపై ఏబీవీపీ మతోన్మాద గుండాలు దాడి చేయడం అత్యంత దుర్మార్గమని, దుండగులపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రచయితలపై భౌతిక దాడులకు పాల్పడడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. మతోన్మాదుల ఈ ఆగడాలను, దాడులను ప్రజలు ప్రజాస్వామికవాదులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ మోడీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా మేధావులపై, రచయితలపై, కవులపై కళాకారులపై, ప్రజాస్వామిక వాదులపై మతోన్మాద అల్లరి మూకల దౌర్జన్యాలు దాడులు పెరిగిపోయాయన్నారు. ప్రముఖ కవులు రచయితలు గోవిందు పన్సారే , కల్బుర్గి , నరేంద్ర దబోల్కర్, గౌరీ శంకర్ లను ఈ మూకలు హతమార్చిన చర్యలు లేనందున ఇలాంటి దాడులు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండి లోక్ సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛను రక్షించాలని వెంకట్రాములు అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అవకాశవాది కడియం వెంటనే రాజీనామా చేయాలి

## బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్



**వరంగల్ వాయిస్, కేయూ :** హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) ఆధ్వర్యంలో మొదటి గేటు వద్ద కడియం శ్రీహరి రాజీనామా చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసి కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ కాకతీయ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో అనేక పదవులు అనుభవించి, కష్టకాలంలో పార్టీకి అండగా ఉండవలసింది పోయి, తన బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం, తన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసనసభ్యుడు కడియం శ్రీహరికి సిగ్గు లేదని విమర్శించారు. నైతిక విలువలు చెప్పేటువంటి కడియం శ్రీహరి, నీతి నిజాయితీ ఉంటే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ పార్లమెంటు స్థానంలో పోటీ చేసేటువంటి కడియం కావ్యను ఎట్టి పరిస్థితుల్లో గెలవనీయబోమని, బ్లాక్ మెయిల్ రాజకీయాలు మాని ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఖబర్దార్ కడియం శ్రీహరి, మీరు వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని ఎలా గెలుచుకుంటారో చూస్తామని, దళితులంతా ఒక్కటి అయ్యారని, బహుజనులంతా ఒక్కటి అయ్యారని, అనేకమందికి అన్యాయం చేసినటువంటి నీ చరిత్ర ప్రజలకు వివరించి మీకు తగిన బుద్ధి చెబుతామన్నారు. ఆనాడు బీఆర్ఎస్ పార్టీలో తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్, అరూరి రమేష్ వంటి వారిని అప్రతిష్ట పాలు చేసి పార్టీ నుంచి వెళ్లగొట్టిన చరిత్ర హీనుడివన్నారు. బీఆర్ఎస్ పార్టీలో తన కూతురి కోసం సైతం బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డాడని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతోమంది సీనియర్ నాయకులను రాజకీయంగా అనగదొక్కిన కడియం శ్రీహరికి రానున్న రోజుల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ప్రజలంతా కూడా చరిత్రను గమనిస్తున్నారని ఆరోజు ఎన్టీఆర్ చంద్రబాబుకు వెన్నుపోటు పొడిచినట్టే ఈనాడు కేసీఆర్ కు కూడా వెన్నుపోటు పొడిచారని అన్నారు. ఇలాంటి వెన్నుపోటు దారుడికి ఓటు వేస్తే ప్రజలు కూడా అనేక ఇబ్బందులకు గురవుతారని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ కూడా పునర్ ఆలోచించాలని, ఎప్పటినుండో పని చేస్తున్నటువంటి కాంగ్రెస్ నాయకులను ఈ దళిత దొర తన స్వార్థ రాజకీయం కోసం బలి పశువులను చేశాడని అన్నారు. కాంగ్రెస్ లో ఉన్నటువంటి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి ,యువత ఏకమై కడియం కూతురికి ఈ ఎన్నికలలో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శి కంజర్ల మనోజ్ , సంగని సూర్య కిరణ్, అర్బన్, రూరల్ కోఆర్డినేటర్స్ అరూరి రంజిత్, లంక రాజ్ గోపాల్, రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీర స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మేర్జ అనిల్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం నుండి సోషల్ వర్క్ లో "డెవలప్మెంట్ అండ్ అండర్ డెవలప్మెంట్ ఎమాంగ్ డిఫరెంట్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఇన్ తెలంగాణ స్టేట్ -ఏ స్టడీ (development and under development among different schedule castes in Telangana state -a study)" అనే అంశంపై కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, సీనియర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను మేర్జ అనిల్ పీహెచ్ డీ పట్టా పొందారు. కాకతీయ యూనివర్సిటీ నుండి సోషల్ వర్క్ లో UGC NET -JRF సాధించిన ఏకైక విద్యార్థి అనిల్ కావడం గమనార్హం. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన అనిల్ తల్లిదండ్రులు మేర్జ అంజయ్య- భారతమ్మ దినసరి కూలీలుగా పనిచేస్తూ డాక్టర్ అనిల్ ను ఉన్నత చదువులు చదివించారు. డా.మేర్జ అనిల్ పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పరిశోధనా పత్రాలు సమర్పించారు. వివిధ సామాజిక అంశాలపై వివిధ వార్తా పత్రికల్లో 60కి పైగా ఎడిటోరియల్స్ రాశారు. ఈ సందర్భంగా డా.అనిల్ కు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డితో పాటు పలువురు పాలనాధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్సీ టికెట్ ఉద్యమకారులకే కేటాయించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక రాబోతున్న వరంగల్ నల్గొండ ఖమ్మం స్తానంలో ఉద్యమకారులకు టికెట్ కేటాయించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో కాకతీయ యూనివర్సిటీ పాత్ర చాలా గొప్పది యూనివర్సిటీలో అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ కోసం బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘానికి పెద్ద అన్న పాత్ర పోషించి అనేకమైన కేసులు, జైలు జీవితం గడిపి పార్టీ కమిట్మెంట్ పర్సన్ అయిన తెలంగాణ రాష్ట్ర వికలాంగుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలని, తెలంగాణ ఉద్యమకారులు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల మాజీ అధ్యక్షుడు, మాస్టర్జి విద్యాసంస్థల చైర్మన్ మాజీ కూడా చైర్మన్ సుందర్ రాజ్ కు అయినా అవకాశం కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి ఆర్షం మధుకర్ కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

## అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎంజేపీ

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో చదువుతున్న 78 మంది విద్యార్థులు మార్చి నెలలో నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కాగా మంగళవారం వెలువడిన ఫలితాల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లుగా పాఠశాల ప్రిన్సిపల్ మోతే రాజ్ కుమార్ తెలిపారు. అందులో ముగ్గురు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించగా ఏడుగురు విద్యార్థులు 9.8 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

## హ్యాండ్ బాల్ (పురుషుల) టోర్నమెంట్ టీం ఎంపిక



**వరంగల్ వాయిస్, కేయూ :** మే నెల 2 నుంచి 5 వరకు కేరళ కొట్టాయంలోని ఎండీ యూనివర్సిటీ లో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ (పురుషుల) టోర్నమెంట్ టీంను ఎంపిక చేసినట్టు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై వెంకయ్య తెలిపారు. వీరిలో బి.సాయి కుమార్, వరంగల్ ఎల్.బి. కాలేజీ, జి.కరుణాకర్, ఎస్.అశోక్ ఖమ్మం, విశ్వవిద్యాలయ వ్యాయమ కళాశాల, డి.వెంకటేష్, డి. శ్రీనివాస్, హనుమకొండ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల, ఎస్. అరవింద్, యూనివర్సిటీ కాలేజీ, సీహెచ్ ఉపేంద్ర, పి.సాయి తేజ ఖమ్మం, ఎస్. ఆర్ అండ్ బీజీఎన్ఆర్, మహమ్మద్ గౌస్ పాషా, హనుమకొండ న్యూ సైన్సు డిగ్రీ కాలేజీ, బి.సంతోష్, మంచిర్యాల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, టి.అజయ్, వరంగల్ సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీ, పి.సిద్ధు, విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల వరంగల్ ఉన్నారు. వీరికి మేనేజర్ గా ఖమ్మం విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనివాస రావు వ్యవరిస్తారని అయన తెలిపారు, వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి క్రీడాకారులను అబినందించారు.

## నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉన్నత చదువులు చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు వంశీ ఫౌండేషన్ తరపున ఫౌండర్ మురళీధర్ రెడ్డి, అనుగు రామిరెడ్డి లక్ష్మణ్ రెడ్డిలకు మూడు లక్షల 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. వరంగల్ కు చెందిన ఇద్దరు కవల పిల్లలు రామ్ రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి చదువుకునే సమయంలోనే తండ్రి ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్థితిలో ఉండిపోయాడు. ఆయన ఇద్దరు కొడుకులు ఉన్నత చదువులు చదవాలనే కోరిక తండ్రికి ఉండేది. దానిని స్ఫూర్తిగా తీసుకున్న కొడుకులు రామ్ రెడ్డి వరంగల్ నిట్ కళాశాలలో లక్ష్మణ్ రెడ్డి, కేరళలో ఒక యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. కానీ, వాళ్లు ఆర్థిక పరిస్థితులు చాలా ఇబ్బందిగా ఉందని తెలుసుకున్న మురళీధర్ రెడ్డి తన కొడుకు పేరు మీద నడుస్తున్న వంశీ ఫౌండేషన్ తరపున ఇద్దరికీ మూడున్నర లక్షల ఆర్థిక సాయం చెక్కు రూపంగా అందజేశారు. మడికొండలోని తమ సాఫ్ట్ వేర్ కంపెనీ వద్ద ఈ చెక్కును వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కో ఫౌండర్స్ వంశీధర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ మహిళా ఉద్యోగినులకు సన్మానం



**వరంల్ వాయిస్, కేయూ :** పదవీ విరమణ చేసిన విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగినిలను విశ్వవిద్యాలయ బోధనేతర గెజిటెడ్, నాన్ టీచింగ్, నాల్గవ తరగతి మహిళా ఉద్యోగులందరూ అతిథి గృహంలో శాలువా, జ్ఞాపిక, బోకే లతో సన్మానించారు . సన్మానం పొందిన వారిలో పరిక్షల విభాగ సూపరింటెండెంట్ ఆర్.అరుణ కుమారి, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల జూనియర్ అసిస్టెంట్ పి.నీలా, రిజిస్ట్రార్ పేశికి చెందినా కామాటి సుగుణ, డీన్ కాలేజీ డెవలప్ మెంట్ కౌన్సిల్ ఆఫీస్ కు చెందిన కామాటి కమలమ్మ ఉన్నారు. బోధనేతర మహిళా ఉద్యోగులందరూ పాల్గొన్నారు.

## ఓటరు అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో వంద శాతం పోలింగ్ నమోదు చేసేందుకు ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని మెప్మా ప్రాజెక్టు అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీలు పేర్కొన్నారు. మంగళవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా కాజీపేట, సీఆర్సీ సెంటర్ నుంచి కాజీపేట ట్రాఫిక్ జంక్షన్ వరకు స్వయం సహాయక సంఘాల సభ్యులు, రిసోర్స్ పర్సన్‌లు, నగర ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, నినాదాలు చేసి తాము నిష్పక్షపాతంగా తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ అనంతరం ఇంటింటికి ప్రచారం నిర్వహించి మహిళలకు కుంకుమ బొట్టును అందించారు. సంబంధిత పోలింగ్ స్టేషన్లలో వారి ఓట్లను ఎన్‌క్యాష్ చేయడం ద్వారా ఓటు ప్రాముఖ్యత, మే 13న జరిగే లోకసభ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని తమ ఓటును వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీఏసీ, ఏడీఎంసీ, సీఓఎస్‌లు పాల్గొన్నారు.

## వరంగల్ బస్టాండులో అన్నదానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని వరంగల్ బస్టాండులో శ్రీమాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం దాదాపు 300 మంది ప్రయాణికులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు భోజనానికి ఇబ్బందులు పడుతున్నందున ఈ కార్యక్రమాన్ని చేపట్టి, విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈఈ అన్నదానంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నన్నపు సంజీవరావు, ఉపాధ్యక్షులు పీవీ రాజేందర్, ముద్దసాని శ్రీనివాస్, కోశాధికారి కె.కళ, కె.మల్లాజి, డి.రాజమౌళి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల టాపర్‌గా మామిడి ఇందు

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న మామిడి ఇందు మంగళవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో 9.5 జీపీఏ సాధించి మండల్ టాపర్ గా నిలిచింది. ఉన్నత పాఠశాల రాయపర్తి, కంఠాత్మకూర్ లో చదివిన అక్షయ 9 జీపీఏ, వర్షిత్ కుమార్ 9 జీపీఏ సాధించి ద్వితీయ స్థానంగా, ఉన్నత పాఠశాల రాయపర్తిలో చదివిన అక్షయ నందు 8.8 జీపీఏ సాధించి తృతీయ స్థానంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, వేణుగోపాలస్వామి, శోభారాణి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలతో పోటీపడి మంచి జీపీఏ సాధించడానికి అహర్నిశలు కృషి చేసిన నడికూడ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయ బృందానికి పీఆర్టీయూ నడికూడ మండల శాఖ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కటుకొజ్వాల సతీష్, మండల శాఖ కార్యవర్గం రాష్ట్ర బాధ్యులు జిల్లా బాధ్యులు అభినందనలు, కృతజ్ఞతలు, అదేవిధంగా మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# ఆ సినిమాలంటే ఇష్టం

## నటి మాళవికా మోహన్



మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటారో తెలిసిందే! ప్రస్తుతం ఆమె చేతిలో తమిళంలో 'తంగలాన్', తెలుగులో 'రాజా సాబ్', హిందీలో 'యుద్ర' చిత్రాలున్నాయి. అయితే ఈ మూడు చిత్రాలు షూటింగ్‌కు విరామం రావడంతో ఆమె కాస్త చిల్ అవుతున్నారు. ఇటీవల ఫారిన్ ట్రిప్ వేసిన ఆమె ప్రస్తుతం ఇంట్లో ఉంటూ అభిమానులతో నెట్టింట ముచ్చట్లు పెడుతున్నారు. 'ఆస్క్ మాళవిక' అంటూ ట్విటర్‌లో క్వశ్చన్ అండ్ ఆన్సర్ సెషన్ నిర్వహించారు. ఆమె నటిస్తున్న చిత్రాలు, ఇష్టాయిష్టాల గురించి పలువురు నెటిజన్లు అడగగా, ఓ నెటిజన్ మాత్రం అసహనానికి గురయ్యే ప్రశ్న అడిగాడు. ఇంతకీ అతను అడిగిన ప్రశ్న ఏంటంటే.. 'గ్లామర్ షో చేయడం కాకుండా పాత్రకు తగ్గట్లు యాక్ట్ చేయడం ఎప్పుడు మొదలుపెడతారు' అని అడిగాడు. ఆ ప్రశ్నకు అసహనానికి లోనైన మాళవిక ' నేను చేయను. నీకు ఏమైనా ఇబ్బందా?' అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చింది. 'ఫీల్ అవ్వకండి మేడమ్', 'మీరు అలాంటి వారికి ఎందుకు ఆన్సర్ ఇస్తారు' అంటూ మరికొందరు అభిమానులు ఆమెను కూల్ చేశారు. తనకు లవ్ డ్రామా, రొమాంటిక్ కామెడీ, థ్రిల్లర్ జానర్ సినిమాలంటే చాలా ఇష్టమని చెప్పారు. కథానాయికల్లో అనుష్కాశెట్టి, సమంత అంటే చాలా ఇష్టమని, ఫస్ట్ సెలబ్రిటీ క్రష్ హృతిక్ రోషన్ అని తెలిపింది.



# చకచకా తండేల్ షూటింగ్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న చిత్రం తండేల్ చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో కోలీవుడ్ భామ సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో పోషిస్తోంది. తండేల్ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌కు సంబంధించిన వార్త ఇప్పటికే అక్కినేని అభిమానులను ఖుషీ చేస్తోంది. తండేల్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ లాట్‌ఫాం నెట్‌ప్లిక్స్ దక్కించుకోగా.. తండేలా స్ట్రీమింగ్ రైట్స్‌ను నెట్‌ప్లిక్స్ రూ.40 కోట్లకు సొంతం చేసుకుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన వర్కింగ్ స్టిల్ ఒకటి బయటకు వచ్చింది. చైతూ, సందీప్ వేద్, జబర్దస్త్ మహేశ్, చందూ మొండేటి అండ్ టీం షూటింగ్ లొకేషన్‌లో తీసిన స్టిల్‌ను షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. తండేల్ నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. తండేల్‌లో సాయిపల్లవి పోషిస్తున్న సత్య పాత్ర ఇంట్రడక్షన్ వీడియో ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయిగా కనిపించనుంది. తండేల్ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. తండేల్ 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# దాన్ని వదులుకోవడం తెలివి తక్కువతనం

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా అగ్ర కథానాయకుల సరసన అలరించారు ఇలియానా. తాజాగా ఆమె ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను నటించిన ఓ బాలీవుడ్ చిత్రం తర్వాత దక్షిణాదిలో అవకాశాలు తగ్గాయన్నారు. '2012లో అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కిన 'బర్ఫీ'లో ప్రధానపాత్ర పోషించాను. అప్పటికే నేను దక్షిణాదిలో ఫుల్ బిజీ. బర్ఫీ కథా చాలా నచ్చింది. అలాంటి చిత్రాల్లో అవకాశాలు అరుదుగా వస్తాయనిపించింది. దాన్ని వదులుకోవడం తెలివి తక్కువతనంగా భావించాను. అందుకే ఓకే చేశా. అనుకున్నట్లుగానే అది ప్రేక్షకాదరణ పొందింది. దీంతో అందరూ నేను దక్షిణాదిని వదిలేసి బాలీవుడ్‌కు మకాం మార్చానని అనుకున్నారు. ఇక సౌత్ ఫిల్మ్స్‌లో నటించనని భావించారు. ఆ అపోహతోనే నాకు అవకాశం ఇచ్చేందుకు దర్శకనిర్మాతలు ఆసక్తి చూపలేదు. బాలీవుడ్‌కు వెళ్లాక నేను సినిమాలు ఎంపిక చేసే విధానంలో మార్పు వచ్చింది. చాలా సెలక్టివ్‌గా వ్యవహరించా. ఏ పని అయినా నిజాయితీగా చేస్తా. నా పాత్రకు వందశాతం న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాను. కానీ పరిశ్రమకి వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా.. నాకు రావాల్సిన గుర్తింపు రాలేదనిపిస్తుంది. దానికి కారణం కూడా తెలీదు' అని చెప్పారు.తాజాగా ఇలియానా 'దో ఔర్ దో ప్యార్'తో ప్రేక్షకులను పలకరించారు. విద్యాబాలన్, ప్రతిక్ గాంధీలు ఇందులో కీలకపాత్రలు పోషించారు. ఇటీవల విడుదలైన ఈ రొమాంటిక్ కామెడీ డ్రామా బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ అందుకుంది. కొన్ని నెలల క్రితం ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది.



# ఎగ్ ఫ్రీజింగ్ చేయించా..

ఇటీవల హీరోయిన్ మృణాల్ ఠాకూర్ చేసిన కామెంట్స్ ఫిల్మ్ వర్గాల్లో హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత రోజుల్లో సరైన రిలేషన్ షిప్ దొరకడం చాలా కష్టమని.. అందుకే తాను ఎగ్ ఫ్రీజింగ్ గురించి ఆలోచిస్తున్నట్లు చెప్పుకొచ్చింది. దీంతో అసలు ఎగ్ ఫ్రీజింగ్ అంటే ఏంటీ ? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఎగ్ ఫ్రీజింగ్ అంటే వయసులో ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన అండాల్ని భద్రపరచుకోవడం. కావాల్సినప్పుడు పిల్లలను కనే వెసులుబాటు కల్పిస్తోన్న ఈ సంతాన పద్ధతిని చాలా మంది హీరోయిన్స్ పాటిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ ఈ ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోగా.. ఇప్పుడు హీరోయిన్ మెహ్రీన్ కూడా ఆ జాబితాలో చేరారు. తాను ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకున్నానని.. గత రెండేళ్లుగా దీనికోసం ప్రయత్నిస్తున్నట్లు ఓ వీడియోను షేర్ చేస్తూ అసలు విషయం బయటపెట్టింది. 'ఇది నా వ్యక్తిగత విషయం.. కానీ అందరితో పంచుకోవాలా ?వద్దా? అని చాలాసార్లు ఆలోచించాను. కానీ నాలాంటి చాలా మంది మహిళలు ఈ ప్రపంచంలో ఉన్నారు. ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి ?ఎప్పుడు పిల్లలను కనాలి ? అని ఇంకా నిర్ణయించుకోలేకపోతున్నారు. భవిష్యత్తు కోసం ఇది చాలా ముఖ్యం అని నేను భావించాను. దీని గురించి ఎవరు ఎక్కువగా మాట్లాడడం లేదు. కానీ ఇప్పుడు మారుతున్న టెక్నాలజీ సాయంతో మన కోసం మనం మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. తల్లి కావాలనేది నా కల. కానీ అందుకు కొన్ని సంవత్సరాలు ఆలస్యం కావచ్చు. అందుకే ఈ ఎగ్ ఫ్రీజింగ్. ఆసుపత్రులంటే భయం ఉన్న నాలాంటి వారికి ఇది పెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే హార్మోన్ల ఇంజక్షన్స్ కారణంగా నేను ఆసుపత్రికి వెళ్లిన ప్రతిసారీ కళ్లు తిరిగి పడిపోయాను. ఇది విలువైదేనా అని అడిగితే కచ్చితంగా అవును అని చెబుతాను. మీరు ఏ పని చేసినా మీకోసమే చేయండి.. ఇందుకు ఎప్పుడూ నా పక్కనే ఉన్న నా గైనకాలజిస్ట్ డాక్టర్ రిమ్మి.. మా అమ్మకు ధన్యవాదాలు' అంటూ మెహ్రీన్ రాసుకొచ్చారు. ప్రస్తుతం మెహ్రీన్ షేర్ చేసిన వీడియో నెట్టింట వైరలవుతుంది.

# పారదర్శకంగా ఎన్నికలు




**సీ-విజిల్ ఆప్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలి**

**రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య**

**సీపీ అంబర్ కిషోర్ ఝూతో కలిసి విలేఖరుల సమావేశం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్వో ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గంలో బరిలో నిలిచిన అభ్యర్థుల పేర్లు ఖరారైనాయని, వారికి గుర్తులు కూడా కేటాయించడం జరిగిందని తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి 48 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా అందులో ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పోటీలో 42 మంది ఎన్నికల బరిలో ఉన్నారని, వారికి గుర్తులను కూడా కేటాయించామన్నారు. 2024 ఏప్రిల్ 26 తుది ఓటర్ల జాబితా ప్రకారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 18,24,466 ఓటర్లు, 1,026 మంది సర్వీస్ ఓటర్లున్నారన్నారు. అదే విధంగా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 1900 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేవామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో మూడు ఈవీఎంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దివ్యంగులు సౌకర్యవంతంగా ఓటు వేసేలా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. దీనికితోడుగా పార్లమెంట్ పరిధిలో గల ఏడు అసంబ్లీ సెగ్మెంట్లలో యువ, దివ్యంగ, మహిళ మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలో 247 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, 1,309 పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్, 397 పోలింగ్ కేంద్రాల బయట సీసీటీవీ కవరేజ్, 497 మైక్రో అబ్జర్వర్లు, అధిక భద్రత సిబ్బంది ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మే 13 వ తేదీన జరిగే పోలింగ్ కు సుమారు 8,685 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించి మొదటి విడత శిక్షణ, రాండమైజేషన్ పూర్తయిందని, రెండో రాండమైజేషన్ చేసి నియోజకవర్గాల స్థాయిలో రెండో దఫా శిక్షణ నిర్వహించి 3వ రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బందిని కేటాయిస్తామన్నారు.

### మోడల్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు..

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసంబ్లీ సెగ్మెంట్లలో 21 ఎఫ్, ఎస్ టి, 21 ఎస్ ఎస్ టి, 8 వీఎస్ టి, 11 వీఎస్ టి బృందాల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు రూ. 6,33,31,072 విలువైన నగదు, బంగారం, గాంజా, లిక్కర్ ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్వో ప్రావీణ్య వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన 385 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు 143 ఫిర్యాదులు రాగా, సీ-విజిల్ ద్వారా 41, సోషల్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా 1, రాతపూర్వకంగా 3, ఎన్ జీఎస్ పోర్టల్ ద్వారా మొత్తం 817 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించామన్నారు.

### ఇంటింటికీ స్లిప్పుల పంపిణీ..

ఏప్రిల్ 25 నుంచి బీఎల్ వోల ద్వారా ఇంటింటికి ఓటర్ సమాచార స్లిప్స్ పంపిణీ చేస్తున్నట్లు ఆర్వో ప్రావీణ్య ప్రకటించారు. ఓటర్ స్లిప్ లలో ఓటరు తన ఓటు హక్కును ఏ పోలింగ్ స్టేషన్ కు వెళ్లి వినియోగించుకోవాలో మ్యాప్, లోకేషన్ సమగ్ర సమాచారం అందులో ఉంటుందన్నారు. మే 8వ తేదీలోగా స్లిప్పులు ప్రతి ఓటర్ కు చేరేలా జిల్లా స్థాయి అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ద్వారా ఎలక్ట్రానిక్, కేబుల్ ఇతర ప్రసార మాధ్యమాల్లో ప్రసారానికి ముందస్తు అనుమతి పొందాలని, పోలింగ్ కు రెండు రోజుల ముందు వివిధ దినపత్రికలో ప్రచురితమయ్యే అడ్వేర్టైజ్మెంట్ లకు ముందస్తు అనుమతి పొందాలన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 లోని 127 ఏ ప్రకారం కరపత్రాలు, గోడ పత్రికలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించే వాటిపై తప్పనిసరిగా పేరు, చిరునామా, ప్రతుల సంఖ్య, ప్రింటర్ పేరు వాటిపై ఉండాలన్నారు. ఫారం 12 డి కింద 85 సంవత్సరాలు పైబడ్డ ఓటర్లు 1010 మంది, 796 మంది పీడబ్ల్యూ డి ఓటర్లకు ముందుగా హోమ్ ఓటింగ్ ద్వారా మే 3 నుండి 8 వరకు ఓటు వేసేలా ప్రణాళిక ప్రకారం బృందాలను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నికలలో విధులు నిర్వహించే దాదాపు 12 వేల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా, 33 మంది అత్యవసర ఓటర్ల జాబితాలో ఫామ్ 12 ద్వారా నమోదు చేసుకున్నారని వారందరికీ ఓటు హక్కు వినియోగించుటకు ప్రతి ఏ ఆర్ ఓ పరిధిలోని నిర్దేశిత ప్రాంతంలో ఫాసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీరు ఓటు హక్కు వినియోగించుకొనుటకు ఎన్నికల సంఘం ప్రత్యేక సీఎల్ మంజూరు చేసిందన్నారు. స్వీప్ ద్వారా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మే 5న హన్మకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### ఎగ్జిట్ పోల్‌పై నిషేధం..

మొదటి విడత ఎన్నికల నుంచి చివరి విడత ఎన్నికల వరకు ఎగ్జిట్ పోల్ పై నిషేధం ఉందన్నారు. ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు పాలకుర్తి, స్టేషన్ ఘన్పూర్ అసంబ్లీ స్సెగ్మెంట్లకు చెందినవి జనగాంలో, భూపాలపల్లికి చెందినవి భూపాలపల్లి జిల్లా కేంద్రంలో, అదేవిధంగా హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ సెగ్మెంట్ల, వరంగల్ జిల్లా లోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాలు ఏనుమాముల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### పటిష్ట బందోబస్తు..

సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేందుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. ఎలక్షన్ కమిషన్ వారి నియమ నిబంధనలు మార్గదర్శకాలకు అనుగుణంగా పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో, స్ట్రాంగ్ రూం కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేస్తామని చెప్పారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో నిరంతరం సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు చేర్చి భద్రపరచడం తదితర అంశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, విమర్శలకు తావు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ప్రణాళికతో బందోబస్త్ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

ఈ సమావేశంలో సహాయ ఆర్ఓ, డీఆర్ ఓ శ్రీనివాస్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆయుబ్ అలీ, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వన్నారాయణ, వరంగల్ జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అండగా ఉంటా

**మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి**

**ఎన్నికల ప్రచారంలో కడియం కావ్య విజ్ఞప్తి**

**ఐనవోలు మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధిని చేసి చూపిస్తా..అభివృద్ధికి నేడు అండగా ఉంటా..మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి అంటూ వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని డి కన్వెన్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సీపీఎం పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు సీపీఎం బలపరిచిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికలు భారత దేశ ముఖ చిత్రాన్ని మార్చే ఎన్నికలన్నారు. ఆదాని అంబానీలకు దేశ సంపదను దోచిపెట్టే పార్టీ బీజేపీ.. పేద ప్రజలకు పంచి పెట్టే పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీజేపీ అరాచకాలను, అకృత్యలను అరికట్టాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. పేదల పక్షాన పోరాటం చేసే పార్టీ సీపీఎం అన్నారు. వరంగల్ ఎంపీగా గెలిపిస్తే పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని, ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నేను నాయకుడిగా ఎదగేందుకు సీపీఐ, సీపీఎంల ప్రోత్సాహం ఉందన్నారు. బడా బాబులు కోట్ల విలువ చేసే భూములను కబ్జా చేస్తే స్పందించని నేతలు 50గజాలలో గుడిసెలు వేసుకున్న పేద ప్రజల గుడిసెలను తొలగిస్తున్నారని ఆరోపించారు. మీ గుడిసెలపై ఎవరు చెయ్యి వేయకుండా అడ్డుకునే బాధ్యత నాది అన్నారు. గుడిసె వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించే బాధ్యత నేనే తీసుకుంటానంటూ హామీ ఇచ్చారు. పేద వాళ్ళు పేద వాళ్ళుగానే ఉండాలి..ధనికులు మరింత ధనికులు కావాలన్నది ఇది బీజేపీ వైఖరి అని ఆరోపించారు. వామపక్ష పార్టీల పోరాటంతోనే బీజేపీకి అడ్డుకట్ట వేయగలం అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్మిక రైతు మహిళా వ్యతిరేక విధానాలు మోడీ ప్రభుత్వం అమలు చేయాలని చూస్తుంది దీనికి వ్యతిరేకంగా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలన్నారు. వరంగల్ లోక్ సభ ఇండియా కూటమి అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను నిండు మనసుతో ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, హన్మకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, జనగామ జిల్లా కార్యదర్శి ఎం.కనకా రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, టి.ఉప్పలయ్య, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఐనవోలులో ప్రత్యేక పూజలు..

ఐనవోలు మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామిని వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీబీ చైర్మన్ మార్నెని రవీందర్ రావు తో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ సదస్సుపై దాడి అనాగరికం

## మానవ హక్కుల వేదిక ప్రకటన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలో ఈనెల 28న సెక్యులర్ రైటర్స్ ఫోరం (లౌకిక రచయితల వేదిక) ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సదస్సుపై ఏబీవీపీ విద్యార్థి సంఘం దాడి చేసి సభను అడ్డుకుంటూ బ్యానర్లను చింపివేయటం, మహిళా రచయితులనూ, ఇతరులనూ దుర్భాషలాడటం, వ్యక్తులపై భౌతిక దాడులకు పాల్పడటం అనాగరికమైన, అప్రజాస్వామికమైన, ఉన్మాద చర్య అని, ఈ దాడిని మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని ఒక ప్రకటలనో తెలిపారు. రాష్ట్రస్థాయి సాహితీ సమావేశం 'సాహిత్యంలో లౌకిక విలువలు' అనే అంశంపై నిర్వహించబడిందని, ఎన్నికల ప్రచారానికీ, రాజకీయాలకీ సంబంధం లేకుండా జరిగిన సాహితీ సభలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి సైద్ధాంతిక సరళిలకు చెందిన ప్రఖ్యాతిగాంచిన సాహితీవేత్తలూ, రచయితలూ పాల్గొన్నారన్నారు. భౌతిక దాడికి గురైన సాహితీవేత్తలతో ప్రభుత్వ ప్రతినిధులు మాట్లాడి వారిలో ఆత్మ విశ్వాసం నింపాలనీ, రాష్ట్రంలో ఇటువంటి మూక దాడులు పునరావృతం కాకుండా ప్రజాస్వామ్య సంస్కృతిని కాపాడాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని మానవ హక్కుల వేదిక కోరింది. భౌతిక దాడులకు దిగిన వ్యక్తులపైనా, వారిని పంపిన రాజకీయ నాయకులపైనా వెంటనే కేసులు నమోదు చేయించి, అరెస్టు చేయించాలని ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.జీవన్ కుమార్, మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఆత్రం భుజంగరావు డిమాండ్ చేశారు.

# వడ్డేపల్లి ప్రభుత్వ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సత్తా చాటిన విద్యార్థులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన రికార్డు నెలకొల్పారు. పాఠశాలనుంచి 25 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 25 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంట రవికుమార్ తెలిపారు. 9.8 జీపీఏతో తో మట్టెపల్లి రష్మిత సత్తా చాటగా అమిరిశెట్టి సహస్ర 9.2 జీపీఏ, కల్లెం ప్రకాష్ 8.7 జీపీఏ, మాకుల శరాణి 8.7 జీపీఏ సాధించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. ఈ సందర్భముగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారావు కందగట్ల సురేశ్, నర్సింహా రెడ్డి ,ప్రత్యుష, కృష్ణవేణి, రాజగోపాల చారి, భాగ్య కుమారి, మల్లా రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# నిప్పులు కక్కుతున్న భానుడు

## ఎండలకు తోడు ఉక్కపోత

## ములుగు, భూపాలపల్లిలో రెడ్ అలర్ట్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడు నిప్పులు కక్కుతున్నాడు. మండే ఎండలకు తోడు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కన్నా ఐదు డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొద్ది రోజులుగా ప్రమాద హెచ్చరిక స్థాయి 45 డిగ్రీల మార్కును దాటి ఎండలు మండుతున్నాయి. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదెనట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రెండో స్థానంలో ములుగు జిల్లా మంగపేటతోపాటు భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో 45.3, మూడో స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లేగొరి మండలం రాగొంలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలోని మాటూరు, తిమ్మాపురంతో పాటు ఖమ్మం జిల్లా చింతకాని, వనపర్తి జిల్లా పాన్గల్‌లో 45.1 డిగ్రీలు, నిడమనూరు, జగిత్యాల జిల్లా వెల్గటూరులో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. మహబూబాబాద్, నిజామాబాద్ సహా పలు జిల్లాల్లో 44.9 డిగ్రీల ఎండ తీవ్రత కొనసాగింది. ఖమ్మం, ములుగు జిల్లాల్లో వడగాలులు వీచినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం కూడా ఉష్ణోగ్రతల తీవ్రత కొనసాగుతుందని హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. నిరుడు 11 జిల్లాల్లో 35 డిగ్రీలలోపు, 22 జిల్లాల్లో 35 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరికొంత పెరిగే అవకాశం ఉంటుందని, వృద్ధులు, పిల్లలు, వీధి వ్యాపారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# టెన్త్ ఫలితాలలో షైన్ హవా

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కార్పొరేటు విద్యాసంస్థలను తలదన్నేల విద్యారంగంలో విశిష్ట సంస్థగా పేరొందిన షైన్ విద్యార్థులు పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాకే తలమానికంగా నిలిచారు. షైన్ అంటే కేవలం 'ఐఐటి' నే కాదని అన్ని రంగాల్లో మేమే ముందుంటామని మరోసారి రూఢీ అయ్యిందని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10లో 10 జీపీఏ పాయింట్లు సాధించడంలో షైన్ ఎప్పుడూ అగ్రస్థానంలో నిలుస్తుందని మరోసారి నిరూపించబడింది అన్నారు. జిల్లాలోనే అత్యధికంగా 40 మంది 10 జీపీఏ సాధించారన్నారు. అంతేకాకుండా 50 మంది 9.8 జీపీఏ, 50 మంది 9.7 జీపీఏ, 50 మంది 9.5 జీపీఏ, 43 మంది 9.3 జీపీఏ, 55 మంది 9.2 జీపీఏ సాధించి త్రినగరంలోనే గాక రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచారన్నారు. తెలుగు, హిందిలో 160, ఇంగ్లీషులో 125, మాథ్స్ 205, సైన్స్ 248, సోషల్ లో 213 కూడా అత్యధిక 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను షైన్ యాజమాన్యం అభినందించింది. దేశంలోని ప్రతిష్టాత్మక కళాశాలల్లో షైన్ విద్యార్థులున్నారని, దానికి క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన కారణమని డైరెక్టర్ పి.రాజేంద్రకుమార్ తెలిపారు. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, మానసిన వికాసం, విలువలతో కూడిన విద్యను అందిస్తూ, నూతన సమాజ నిర్మాణమే షైన్ విద్యాసంస్థల లక్ష్యమని డైరెక్టర్ మూగల రమ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐటి, కోఆర్డినేటర్ మూగల రమేష్, షైన్ ఎర్రగట్టు గుట్ట చైర్మన్ జె.శ్రీనివాస్, ప్రిన్సిపల్స్ జి.రాజ్ కుమార్, బి.సంపత్, పి.విశాల్, కవితా రాణి, దినేష్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com